


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -143-

(30 ' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"నే కొట్టుకునేదల్లా** కొంచెం మనశ్శాంతికోసం. కొంచెం మనశ్శాంతి అంతే నాయనా.. అంతే" అంటూ ఒక వృద్ధుడు కొడుకుతో చెప్పుకుని బాధపడటం విన్నాను.

మనఃశ్శాంతి కావాలని కుమారుడితో ఆ వృద్దుడు చెప్పుకున్నాడు. కానీ అది ఎలా లభిస్తుందో ఆయన చెప్పలేదు. మొత్తం మీద ఆయన జీవితంలో శాంతం లేదు. అది కొడుకుద్వారా లభించాలి అనేది స్పష్టం.

ఇంతకీ ఆ కుర్రవాడు వెంటనే చెప్పిన జవాబు వింటే ఆ ముసలాయన విజ్ఞప్తి విషయం తెలిసిపోతుంది.

"నీకు మనశ్శాంతి అంటావేమిటయ్యా. ఇప్పుడు మనశ్శాంతి లేక ఏమైందీ? నువ్వేమన్నా సంపాదిస్తున్నావా? సంచులు తెచ్చి గుమ్మరిస్తున్నావా? హాయిగా తింటున్నావు, అరుగుమీద కూర్చుంటున్నావు. అక్కడితో వూరుకోకుండా మాకు వున్న మనశ్శాంతి కూడా చెడగొడుతున్నావు"

ఈ మాటలకి ఆయన ఎన్ని మెలికలు తిరిగిపోయాడో చెప్పడం కష్టం. ఆయనకు ఒకరకంగా మనశ్శాంతి కావలసి వస్తే కొడుక్కి మరో రకం మనశ్శాంతి అవసరం. వంశ సాంప్రదాయాలు కొంచెం నిలబెట్టమనీ, తనమాట కొంచెం పట్టించుకొమ్మనీ తండ్రి గొడవ.

"తిని ఒకచోట పడుకొమ్మంటే నీకింత తీపరమేమిటి? ఇరవై నాలుగు గంటలూ సణుగుతుంటే ఇవతల వాళ్ళకెలా వుంటుంది? నీ శాంతికోసం మాకున్న కొద్ది శాంతి కూడా తీసి దూరంగా గిరాటు వేస్తావేమిటి?" అని కుమారుడి ప్రశ్న.

అసలు 'శాంతం' అనేది ఎక్కడుంది? ఎలా వుంటుంది? ఎలా సంపాదించడం? ఇవన్నీ ప్రశ్నలే.

ఎవర్ని కదిపినా, 'శాంతిలేదు - శాంతిలేదు' అని గగ్గోలు పడటం తప్పడంలేదు. ఈ కొంపలో ఎంత గొడ్డు చాకిరీ చేసినా మనస్సుకు రవంత శాంతిలేదు. ఏం జీవితం?" అని ఇల్లాలు నీళ్ళు కారుతూ వుంటుంది.

"విరిగి ముక్కలై వీధుల వెంటపడి ఎంత సంపాదించి తెచ్చిపోసినా ఈ కొంపలో విశ్రాంతి లేదు. శాంతి లేదు. నరకప్రాయంగా వుంది" అని గృహస్థు గోలపెడుతూ వుంటాడు.

"ఎంత చాకిరీ చేసినా పై వాళ్ళ నెంత పొగిడినా, ఎన్ని చివాట్లు దులుపుకుని దోర నవ్వులు నవ్వుతూ తిరిగినా ఈ ఆఫీసులో నాకు రవంత శాంతి రావడంలేదంటారు క్రింద తరగతి ఉద్యోగి.

"ఎంత హోదా వుంటే యేం లాభం? క్రింద ఉద్యోగుల్ని ఎంత గౌరవించి ఏం ప్రయోజనం? ఉన్న ఓర్పంతా వినియోగిస్తే మాత్రం వచ్చే సుఖమేమిటి? క్రింది వాళ్ళ మూలంగా మనశ్శాంతి చెడిపోతోంది. ఈ ఉద్యోగంలో వున్నంతవరకూ శాంతి హుళక్కి" అని పై వుద్యోగి గొడవపడుతూ వుంటాడు.

"బేరాలెక్కడున్నాయి. ఇదివరకటి దాంట్లో అయిదోవంతు లేవు. అందులో మళ్ళీ సగం అప్పులు. శాంతంగా వ్యాపారం చేసుకునే రోజులు కావివి. ఆ రోజులెప్పుడో పోయాయి. అప్పులు, అశాంతీ ఇవే వ్యాపార లక్షణాలు ప్రస్తుతం" అంటాడు వ్యాపారంలో వున్న పెద్ద మనిషి.

"ఎవడొచ్చినా అర్ధరూపాయి వేసుకో వడ్డీ, అంతగా అయితే ముప్పావలా వేసుకో బ్యాంకు వడ్డీకి కొంచెం అటూ, ఇటూ" అంటూ కూర్చుంటాడు. ముప్పావలా వడ్డీకి అప్పులిస్తే అడుక్కు తింటూ పోవాలి.

రెండు రూపాయల వడ్డీ ఇస్తామనే వాడే కనపడటంలా. మూడు మాట దేవుడెరుగున్నాడు. ఇదుగో ఈ వాయిదాల పాటలు, చిట్‌ఫండ్‌లు వచ్చి వడ్డీ వ్యాపారం చెడగొట్టినాయి. మనశ్శాంతి లేకుండా పోయింది. మాయ వ్యాపారంలోని వడ్డీ వ్యాపారస్థుడు ఆయాసపడిపోతూ వుంటాడు.

కొందరి మనశ్శాంతికి సంబంధించిన అవసరాలు చాలా చిన్నవిగా వుంటాయి. కొన్ని అలవికానివిగా వుండి ఆ అశాంతి అలాగే వుండిపోతుంది చాలాకాలం. చేతిలో పది గవ్వలు లేకుండా ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యవలసిన తండ్రికి గల అశాంతి తొలగడం సాధ్యమా మరి. ఆయనగారికి ప్రశాంతత ఎలా వస్తుంది? అలాటివారు తమ జీవితాన్ని తలుచుకుని "నాకు శాంతి అనేది ఒకసారె" అది శాశ్వత శాంతే" అనుకుంటూ వుంటారు పాపం.

ఈ రోజుల్లో నిజానికి అశాంతిలో పడటం, తిరిగి శాంతి సంపాదించుకోవడం ఏమంత గొప్ప విషయాలుగా లేవు. శాంతి స్వరూపాలు అనేక రకాలుగా మారిపోవడమే. "నాలుగురోజుల క్రిందట పిల్లాడి ఉయ్యాల త్రాళ్ళు తెగిపోయాయి. చెప్పగా చెప్పగా ఇవ్వాళ తెచ్చారు. ఆ ఉయ్యాల కట్టి వాణ్ణి అందులో పడుకోబెట్టి రెండు వూపులు వేసి నిద్రకొడితే మనస్సుకు కొంచెం శాంతిగా వుంది" అంటుందొక ఇల్లాలు. ఈ ఇల్లాలి అశాంతి, శాంతీ, అర్ధరూపాయి నంబరు తాడులో వున్నాయంటే ఆశ్చర్యంగా వుండదు.

"వారం రోజులనుంచి చెప్పగా చెప్పగా మా ఆవిడ ఇన్నాళ్ళకు కొంచెం దయతలచి రెండు లుంగీలూ, రెండు బనీన్లూ కొంచెం సర్ఫ్‌లో వుతికి దణ్ణాన పారేసింది. వాటిని చూచిన తర్వాత కొంచెం మనస్సుకు శాంతిగా వుంది. తెలుపు మాట

ఆలోచించి కాదు. భర్తనుగా నేను సాధించిన గెలుపును తలుచుకుని" అని ఒక వెర్రి భర్త ఎంతో ఆనందం చెందడం కూడా కద్దు.

శాంతి దేవత ఈ ఆధునిక యుగంలో కోటి రూపాల్లో అవతరించి జీవుల్ని కనికరిస్తోంది పాపం. వేసవి కాలం సెలవలు ఇచ్చినప్పటినుంచి కుర్రాడు ప్యాసవుతాడో లేదోననే అశాంతితో బాధపడుతూ వుంటారు తల్లి తండ్రులు. అతడు విజయం పెంపొందిస్తే సీటు దొరుకుతుందో లేదో అనే అశాంతి. ఈ అశాంతి ఏడో క్లాసు చదివే రోజుల్లో ప్రారంభమై ఎమ్మేలో చేరేవరకు అలాగే ఉంటుంది. జీతం కట్టి వచ్చిన తర్వాత "ఇటీవల ఇంత ప్రశాంతత ఎప్పుడూ సంపాదించలేదు. ఇదంతా ఆ సరస్వతీ కటాక్షం. మూడు రోజులు సెలవు పెట్టి మురుసుకోవడం జరుగుతూ వుంటుంది."

ఇలా శాంతి కాని శాంతి ఏదో కల్పించుకుని మానవులు నిజమైన శాంతి ఎక్కడ పొంద గలుగుతున్నారు. శాంతి దేవత ఎక్కడ దాక్కుందో కూడా తెలియడం లేదు. సంసారాల్లో అశాంతి, సంస్థల్లో అశాంతి, ప్రభుత్వాలలో అశాంతి. ఎక్కడపడితే అక్కడికి అశాంతి దేవత విషపు లెక్కలతో వచ్చి వ్రాలుతోంది.

వేదాలలో, ఇతర మంత్రాలలో, కవిత్వాలలో 'ఓం శాంతి శ్శాంతి శ్శాంతి' అని వేస్తారుక్రింద. కార్డుల మీద వున్న ఆ శాంతి ఆవరిస్తోంది చాలా సంసారాల్లో.

"ఎందుకమ్మా ఎన్నడూ అలా వూవెంట తిరుగుతావు?" అని ఒకావిణ్ణి ప్రశ్నిస్తే "కొంపలో శాంతి లేక" అంది. అంతేగాని ఆవిడగారు కొంప వదిలి వీధిని పడటం వల్ల కొంపలో మరింత అశాంతి ప్రబలుతుందనే సత్యం ఆవిడకు తోచలేదు.

"మా వూర్లో మొత్తానికి ప్రశాంతత అంటూ వుంది. బొత్తిగా లేకపోలేదు అయితే, అది ఉపయోగపడటం లేదు. అశాంతి మా యింట నృత్యం చేసేదెప్పుడో తెలుసా? అందరూ నిద్రపోయేటప్పుడు" అన్నదట ఒకావిడ.

అది విన్న ఇల్లాలు "మీరు అదృష్టవంతులు. అలాంటప్పుడైనా శాంతి లభిస్తోంది. మా కొంపలో అదీలేదు. మావారు నిద్రల్లో వేసిన పిచ్చి కేకలు మేలుకున్నప్పుడు వెయ్యిరెట్లు. అందువల్లనో ఏమో, నాకు నిద్రపోతే చాలు పిచ్చి కలలు ఇక శాంతి ఎక్కడ?" అందిట.

ఈ శాంతి అన్వేషణలు గురించి వివరాలు చాలా వున్నాయి. వాటిని మరోసారి.

Post your comments